దద్దరిల్లేలా.. కేటీఆర్ బహిరంగ సభ

సభకు హాజరైన ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేటీఆర్ మీటింగ్ సూపర్ డూపర్ హిట్

- బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యాలయం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అనూహ్యస్పందన
- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు..
- ఆనందడోలికల్లో గులాబీ నేతలు

దుండిగల్/కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, డిసెంబర్ 9: దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలో సోమవారం నిర్వహించిన బహిరంగసభ సూపర్ డూపర్ హిట్ అయ్యింది. నేతలే ఆశ్చర్యపోయేలా వేలాదిగా కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు హాజరుకావడంతో గులాబీసైన్యం ఆనందడోలికల్లో తేలియాడేలా చేసింది. గండిమైసమ్మలో నూతనంగా నిర్మించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సభకు పదివేల మందికి పైగా కార్యకర్తలు, నేతలు, అభిమానులు, సామాన్య ప్రజానీకం స్వచ్ఛందంగా తరలిరావడంతో నేతల్లో ఆనందం తొణికిసలాడింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడిన ప్రతిమాటకు సభకు హాజరైన వారి నుంచి విశేషస్పందన లభించింది. వేదికపై బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు అసీనులైనప్పటికీ సభాధ్యక్షులైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాత్రమే ప్రసంగించారు.

మేడ్చల్ సభకు భారీగా తరలిన గులాబీ శ్రేణులు..

మియాపూర్/అల్లాపూర్, డిసెంబర్ 9: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం భారీగా తరలివెళ్లారు. వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు నేతృత్వంలో తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వారు పార్టీ శ్రేణులతో కలిసి సభకు బయలు దేరి వెళ్లారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు కార్యాలయ ప్రారంభానికి వెళ్లారు. కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందాడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషాబాబూరావు నేతృత్వంలో ఆయా డివిజన్‌ల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ నినాదాలతో ప్రత్యేక వాహనాల్లో మల్కాజిగిరి పార్టీ కార్యాలయ ప్రారంభానికి తరలివెళ్లారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయటం సీఎం రేవంత్‌రెడ్డికి తగదని, కేవలం సోనియమ్మ మెప్పు కోసమే ఆయన పని చేస్తున్నారని కార్పొరేటర్లు పార్టీ శ్రేణులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల పార్టీ నేతలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

చిందేసిన మల్లన్న..

కాగా ఈ సభలో పాల్గొన్న మాజీ మంత్రి మల్లారెడ్డి మరో సారి సభవేదికపై స్టెప్పులేసి కార్యకర్తల్లో జోష్ నింపాడు. అసై దులా హారతి, కాళ్ల గజ్జెల గమ్మతి అనే పాటను కళాకారులు పాడగా మల్లారెడ్డి తనదైన శైలిలో పార్టీ కండువాను గాలిలో తిప్పుతూ, సెప్పులేస్తూ అదరగొట్టాడు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని రగిల్చేలా తన ఆటపాటలతో అలరించగా ఎమ్మెల్సీ దేశపతి తల్లి తెలంగాణమా...? తనువెల్లా మాగాణమా... అంటూ మరో సారి గులాబీశ్రేణులను ఆలోచింపజేశాడు.

కన్న తల్లి ఉండగా..

రాష్ట్ర ప్రజానీకానికి ఇప్పటికే తెలంగాణ తల్లి ఉండగా సవతి తల్లి ఎందుకని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వతీరుతో తెలంగాణ తల్లి ఘోషిస్తుందన్నారు. కాంగ్రెస్ కారణంగా తెలంగాణ ఉద్యమంలో వందలాది యువత ఆత్మబలిదానం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ తనలాంటి ఎంతో మంది సైనికులను తయారుచేశారని తెలిపారు. ముఖ్యమంత్రి పీఠంపై మళ్లీ కేసీఆర్‌ను కూర్చొబెట్టేంత వరకు మనమంతా సైనికులుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ఒత్తిళ్లకు, అణిచివేతకు బయపడేదిలేదని, మనకు రామన్న(కేటీఆర్) అండగా ఉంటాడన్నారు. బీఆర్ఎస్‌లో క్రమశిక్షణ కలిగినప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని, తానే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పార్టీ అన్నిరంగాల్లో విఫలమైందని, దీంతో ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డితో పాటు మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహముద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, విజేయుడు, నందికంటి శ్రీధర్ ఎమ్మెల్సీ నవీన్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేటీఆర్ కానున్న నేపథ్యంలో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు ఆధ్వర్యంలో తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

మేడ్చల్ సభకు పార్టీ శ్రేణులతో బయలు దేరుతూ.. వివేకానందనగర్ డివిజన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు

బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి తరలివెళ్తూ..

పార్టీ శ్రేణులతో మేడ్చల్ సభకు బయలు దేరుతున్న కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

మేడ్చల్ సభకు పార్టీ శ్రేణులతో బయలు దేరుతున్న కార్పొరేటర్ బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబూరావు

బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు

వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ కె.రామేశ్వర్‌రెడ్డి తదితరులు

ఆర్ఎస్‌కే హైస్కూల్‌లో వర్చువల్ రియాలిటీ ల్యాబ్ ప్రారంభం

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 9: కుత్బుల్లాపూర్‌లో ఆర్ఎస్‌కే హైస్కూల్‌లో కేఐ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను సోమవారం పాఠశాల కరస్పాండెంట్ కె.రామేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వీఆర్ సాంకేతికను ఉపయోగించి మొక్కల కణాలు, గుండె పనిచేసే విధానాన్ని పరిశీలించి, పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం ఉందన్నారు. టెక్నాలజీని విద్యలో సమ్మిళితం చేయడంలో ఆర్ఎస్‌కే స్కూల్ ముందడుగు వేసి, విద్యాప్రమాణాలను మరింత అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిన్నట్లు తెలిపారు.

మండల స్థాయి టాలెంట్ టెస్ట్..

తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జడ్‌పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. కాగా మూసాపేట జడ్‌పీ పాఠశాల విద్యార్థిని పూజ ప్రథమ స్థానం, శంషీగూడ జడ్‌పీ విద్యార్థి హన్సిత ద్వితీయ స్థానం, బాలానగర్ మండలానికి సంబంధించి హస్మత్‌పేట జడ్‌పీ పాఠశాలకు చెందిన రితిక ప్రథమ బహుమతులను సాధించారు. విజేతలకు ఎంఈవో కిషన్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీధర్, రాథోడ్ శంకర్, శ్రీరంజని, ఉమా వసుంధర, అంజిలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 9

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాపూర్, డిసెంబర్ 9: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ శృంగేరి శారద శంకరమఠం ధర్మకర్త సీఎస్ఆర్‌మూర్తి ప్రజలకు సూచించారు. సోమవారం మోతీనగర్ పరిధిలోని శ్రీ శృంగేరి శారద శంకరమఠం ఆవరణలో సాధురామ్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షాకేంద్రాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 275 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులతో పాటు ఉచితంగా సుమారు 175 మందికి కంటిఅద్దాలు కూడా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ముగ్గురికి క్యాటరాక్ శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 9: సమాజ శ్రేయస్సులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ సురభీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో డాక్ ఆన్‌లైన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంపు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు డాక్ ఆన్‌లైన్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బసవరాజు, పాండురంగరాజు, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

షాపూర్‌నగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నేతలు

దుండిగల్, డిసెంబర్ 9: ఆశావర్కర్లపై ప్రభుత్వ అధికారుల వేధింపులకు నిరసనగా సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ మండల నాయకులు ఈ.దేవదానం, పసుల అంజయ్య సమక్షంలో సోమవారం షాపూర్‌నగర్‌లోని సాగర్ హోటల్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆశాలు చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారని, చాలా సంవత్సరాల నుంచి ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని ఆరోపించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఆశావర్కర్లను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశాలపై పెత్తనం తగ్గించాలని లేనిపక్షంలో అధికారులు అనధికారికంగా చేస్తున్న వ్యాపారాలను బహిర్గతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కీలుకాని లక్ష్మణ్, శ్రీనివాస్, ఖలీల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో అక్రమ పబ్‌లపై హై కోర్ట్‌లో రిట్ పిటిషన్

గోల్డెన్ బారెల్ పబ్, తకీలా పబ్స్ నిర్వాహకులకు హైకోర్ట్ నోటీసులు

దుండిగల్, డిసెంబర్ 9: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్, క్లబ్ కల్చర్‌పై తెలంగాణ హై కోర్ట్ రిట్ పిటిషన్ స్వీకరించింది. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ బాచుపల్లిలో ఏర్పాటు చేసిన గోల్డెన్ బారెల్ పబ్, తకీలా పబ్‌లపై రాష్ట్ర సర్వోన్నత న్యాయ స్థానంను ఆశ్రయించారు. భారతీయ కల్చర్, సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీస్తూ స్థానికులను ఇబ్బంది పెట్టేలా చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేసిన పబ్స్‌పై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని, సరైన అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పబ్స్‌ను మూసి వేయాలని కోరుతూ హై కోర్ట్‌లో ఆకుల సతీశ్ రిట్ పిటిషన్ వేసినట్లు తెలిపారు. చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేసిన పబ్స్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక మున్సిపల్, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు తన ఫిర్యాదులను ఏమాత్రం పట్టించుకోకపోవడమే కాకుండా పబ్స్ ఏర్పాటుకు పరోక్షంగా సహకరించారని హైకోర్ట్‌లో వేసిన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నామన్నారు. ఆకుల సతీశ్ వేసిన రిట్ పిటిషన్ స్వీకరించిన రాష్ట్ర హై కోర్ట్ రిట్ పిటషన్ నంబర్ 34578 ఆఫ్ 2024 ద్వారా సంబంధిత అధికారులకు, పబ్స్ నిర్వాహకులకు కౌంటర్ దాఖలు చేయలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్, బాచుపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ అధికారితో పాటు గోల్డెన్ బారెల్ పబ్, తకీలా పబ్ యాజమాన్యాలకు సోమవారం నోటీసులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆకుల సతీశ్ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా పౌరుల ప్రశాంత జీవితానికి ఆటంకం కలిగేలా నడిచే ఏ వ్యాపారం అయినా పోరాడి ముసి వేయించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

త్వరలో రాష్ట్ర స్థాయి నూతన కమిటీ

జేఎన్‌టీయూహెచ్ జేఏసీకి త్వరలో నూతన రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తామని కమిటీ చైర్మన్ బొట్ల భిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు బల్గర్ సందీప్, దాస్యం విక్రాంత్ పేర్కొన్నారు. కమిటీ ప్రకటన అనంతరం విధి విధానాలనపై దిశా నిర్దేశం చేస్తామన్నారు. ఇక్కడి జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కమిటీతో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ.. మాజీ అధ్యక్షుడు మంద రంజిత్ కుమార్‌కు జేఎన్‌టీయూహెచ్ జేఏసీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కమిటీ పేరును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు, త్వరలో కమిటీని నియమించే వరకు ఏ ఒక్కరైనా ఆ హోదాతో చలామణి అయితే సహించబోమని భిక్షపతి స్పష్టం చేశారు. సంఘం యూనివర్సిటీ సభ్యులు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 9

పరిసరాల పరిశుభ్రత.. కాలనీవాసుల హర్షం

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 9: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎంఎన్.రెడ్డినగర్ సంక్షేమ సంఘం కాలనీలో గత కొన్ని రోజుల నుంచి జనావాసాల సమీపంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంపత్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పారిశుధ్య కార్మికులు సోమవారం కాలనీల్లోని పూర్తిగా శుభ్రం చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఎన్‌రెడ్డినగర్ కాలనీలో ఇండ్ల సమీపంలో పిచ్చిమొక్కలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఘనంగా అయ్యప్ప పడిపూజా మహోత్సవం

దుండిగల్, డిసెంబర్ 9: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బండారి లే అవుట్ కాలనీ అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. బండారి లే అవుట్ కాలనీలోని శ్రీ శక్తి నివాస్ అపార్ట్‌మెంట్‌లో దేవేందర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పుష్పాలతో భజనలతో మహాపడి పూజను వేడుకగా నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి నంబూద్రి శ్రీకాంత్ గురుస్వామి హాజరై, స్వామివారి ఆశీర్వాదం అందించి, స్వామివారి కలశం తీర్థంతో పూజ గురుస్వామి రవి గురుస్వామి కలిసి 18వ పడి పూజ చేసుకున్న దేవేందర్ గురుస్వామికి మంత్రదండము పుష్పాలతో ప్రత్యేకంగా స్వామివారి ఉపదేశంతో పూజలు చేశారు. పూజలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆస్కాని మారుతి సాగర్, కో-ఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్ ముదిరాజ్, దామర జగదీశ్ గుప్తా, అనిల్, తలారి సాయి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/ఐడీ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పరిపాలనాపరమైన పదవుల నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 9: ఓయూలో పలు పరిపాలనా పరమైన పదవుల నియామకాన్ని చేపట్టారు. ఓయూ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ లింగప్ప, సెంటర్ ఫర్ మైక్రోబియల్ అండ్ ఫర్మంటేషన్ టెక్నాలజీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భీమా, జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ హమీదాబీ, సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్ స్టడీస్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసులు, జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సెంటర్ ఫర్ ప్రోడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శివరామకృష్ణ, సెంటర్ ఫర్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీవీ సుధ, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్యామల, రూసా 2.0 కోఆర్డినేటర్‌గా డాక్టర్ అనుపమ, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్‌గా డాక్టర్ రామ్ షెఫర్డ్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

మేడ్చల్ డీఎఫ్‌సీఎస్ చైర్మన్ మన్నె రాజుముదిరాజు హౌజ్‌అరెస్ట్

దుండిగల్, డిసెంబర్ 9: మేడ్చల్ డీఎఫ్‌సీఎస్ చైర్మన్ మన్నె రాజుముదిరాజును పోలీసులు హౌజ్‌అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా చలో అసెంబ్లీకి ఆయన పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి నుంచే రాజుఇంటికి చేరుకున్న సూరారం పోలీసులు ఆయనను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మత్స్యకారుల చలో అసెంబ్లీ రద్దయినట్లైంది.

ప్రజావాణిలో ఫిర్యాదులు

మియాపూర్, డిసెంబర్ 9: కూకట్‌పల్లి జోనల్ సహా కూకట్‌పల్లి సర్కిల్, మూసాపేట సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో 11, మూసాపేట సర్కిల్ కార్యాలయంలో 5, కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో 6 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వ చౌహాన్, డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై తక్షణ చర్యలకు ఉపక్రమించాలని అధికారులను ఆదేశించారు.

కుత్బుల్లాపూర్-గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో..

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 9: కుత్బుల్లాపూర్-గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 14 సమస్యలపై ఫిర్యాదులు అందిన్నట్లు డీసీలు నర్సింహ, మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో చర్చించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.